

నగరపాలక సంస్థలో భగ్గుమన్న విభేదాలు

మేయర్ వర్గం వర్సెస్ డిప్యూటీ మేయర్ వర్గం



● 'బల్దియా'లో రాజకీయ రచ్చ

కరీంనగర్ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పాలకవర్గ పదవీకాలం వంద రోజుల్లో ముగియనున్న తరుణంలో మేయర్, డిప్యూటీ మేయర్, పాలకవర్గ సభ్యుల మధ్య విభేదాలు రోజు రోజుకు రాజుకుంటున్నాయి. బుధవారం నగరానికి వచ్చిన సీడీఎంఏ గౌతమ్‌కు పాలకవర్గ సభ్యులంతా ఒక్కటై వినతిపత్రం ఇవ్వకుండా ఎవరికివారే వినతి పత్రాలను అందించారు. పాలకవర్గ పదవీ కాలం ముగియనుండడంతో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు పనులు పూర్తిచేయలేక పోయామని కార్పొరేటర్లు అసంపూర్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో నిధుల కోసం కలిసికట్టుగా కృషిచేయాల్సిన పాలకవర్గసభ్యుల మధ్య విభేదాలు తలెత్తాయి. అధికా రులు వారిని పట్టించుకున్నట్లు కనిపించడం లేదు.



సీడీఎంఏ గౌతమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న డిప్యూటీ మేయర్ భర్త చల్ల హరిశంకర్

● ఎవరికి వారుగా వినతిపత్రాలు

గతంలో సీడీఎంఏ కానీ, ఇతర ఉన్నతాధికారులు వచ్చిన సమయంలో పాలకవర్గసభ్యులకు కొంత సమయాన్ని కేటాయించి వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకునేవారు. ఈరోజు వచ్చిన సీడీఎంఏను కలిసి తమకు కొంత సమయం కేటాయించాలని పార్టీలకతీతంగా పాలకవర్గసభ్యులు కోరినప్పటికీ ఆయన ప్రత్యేకంగా వారికి సమయం ఇవ్వలేదు. కార్యాలయం బయటనే ఏదైనా చెప్పాలంటే ఇక్కడే చెప్పాలంటూ వారి వద్ద నుంచి వినతిపత్రాలను తీసుకొని వెళ్లిపోయారు. మరోవైపు మేయర్ యాదగిరి సునీల్‌రావు అందుబాటులో లేక పోవడంతో ఆయన లెటర్ హెడ్‌పై 24 మంది కార్పొరేటర్లు సంతకాలు చేసి సీడీఎంఏకు వినతిపత్రం సమర్పిం చారు. తమకు ఎందుకు సమాచారమివ్వలేదంటూ డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి భర్త హరిశంకర్ కార్యాలయంలో ఉన్న కార్పొరేటర్లను ప్రశ్నించారు. మేయర్ సమాచారమివ్వ కుండా, డిప్యూటీ మేయర్ సంతకం లేకుండా ఎలా వినతిపత్రం ఇస్తారన్నారు. ఇది తనను అవమాన పరచడ మేనని, 100 రోజుల తర్వాత ఎవరి పరిస్థితి ఎలా ఉం టుందో, ఇలాంటి అవమానం ఎవరికైనా జరుగవచ్చని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వాల రమణారావుతోపాటు మరికొందరు కార్పొరేటర్లు వినతి పత్రం ఇవ్వాలని మేయర్ తమకు సూచించడంతో ఇచ్చామని సర్దిచెప్పే ప్రయత్నంచేశారు. ఈ క్రమంలో మీరు ఇతర కార్పొరేటర్లకు సమాచారమిచ్చారని, నాకెందుకు ఇవ్వరంటూ హరిశంకర్ ప్రశ్నించారు. తమకు ఎలాంటి సంబంధం లేదని, మేయర్ సూచించడంతో సంతకం చేసి ఇచ్చామని వాల రమణారావు హరిశంకర్‌కు చెప్పడంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగిది. మేయర్, డిప్యూటీ మేయర్ మధ్య ఉన్న విబేధాలతో పాలకవర్గసభ్యులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. మేయర్, డిప్యూటీ మేయర్ మధ్య నెలరోజులుగా జరుగుతున్న పరస్పర ఆరోపణలు, విభేదాలు తారాస్థాయికి చేరుకొని చివరకు బల్దియాలో రాజకీయ రచ్చకు తెరతీశాయి. కార్పొరేషన్ ఎన్నికలకు ముందు ఇలా ఇద్దరు బీఆర్ ఎస్‌కు చెందిన నాయకుల మధ్య విభేదాలు పార్టీకి నష్టం కలిగిస్తాయని ఆ పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ దృష్టికి చల్ల హరిశంకర్ తీసుకెళ్లినట్లు తెలిసింది.



సీడీఎంఏ గౌతమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు



బహు భాషల భాస్కరుడు

- సంగీత, సాహిత్యాల్లో దిట్ట
- పద్నాలుగు భాషల్లో ప్రావీణ్యం
- పదుల సంఖ్యలో అనువాదాలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్

ఆయన.. ఓ అవిశ్రాంత సాధకుడు.. ఇతర భాషలు నేర్చుకోవడమే కాదు.. ఆ సాహిత్యాన్ని అనువాదం చేసి తెలుగు ప్రజలకు అందించారు. ఆయా భాషల్లోని అంశాలపైనే ఎంఫిల్, పీహెచ్‌డీ చేశారు. ఒకసారి స్వగ్రామానికి వెళ్లినప్పుడు ఓ యువకుడు 'అంకుల్ మీకు స్పానిష్ వచ్చా' అని అడిగాడు. తను ఆ భాష ను ఎందుకు వదిలిపెట్టాలని పట్టుబట్టి నేర్చుకున్నారు.. చిన్నప్పటి నుంచి సాహిత్యంతోపాటు సంగీతంపైనా ఆసక్తి ఉండేది. ఉద్యోగ విరమణ తర్వాత సంగీతంపై దృష్టి సారించారు. పుస్తకాల్లో చదివి 12 రాగాలపై పట్టు సాధించారు. ప్రస్తుతం హార్మోనియం, పియానో వాయిస్తారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ 'అంతరంగం' మీ కోసం.. - ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్

7

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

గంగాధర, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని గర్షకుర్తిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండలు ఉన్నందున రైతులకు కేంద్రాల్లో సౌకర్యం కల్పించాలన్నారు. గోనె సంచుల కొరతలేకుండా చూసుకోవాలని కేంద్రాల వద్ద మంచి నీటి ఏర్పాటు, లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. రై తులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకు వచ్చి ప్రభుత్వం నిర్ణయించిన మ ద్దతు ధర పొందాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మేడి పల్లి సత్యం మాట్లాడుతూ ప్రభు త్వం ఏ గ్రేడు ధాన్యానికి 2,320 రూపాయల మద్దతు ధర అంది స్తుందని, దళారు లకు విక్రయించి రైతులు నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో అధనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్డీవో శ్రీధర్, ఏ ఎంసీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిరు మల్‌రావు, తహసీల్దార్ అను పమ, ఎంపీడీవో జనార్దన్‌రెడ్డి, ఏపీఎం పవన్, నాయకులు గునుకొండ బాబు, కర్ర బాపురెడ్డి, పడితపల్లి కిషన్, ఐకేపీ సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



గర్షకుర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి

● కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

రామడుగు: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని వెదిర రైతు వేదిక కార్యాలయ ఆవరణలో బుధవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి, టీ సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్డీవో శ్రీధర్ పాల్గొన్నారు.

'డబుల్ బెడ్‌రూం ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి'

భగత్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్లలో పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలని మున్సిపల్ డైరెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. కొత్తపల్లి మండలం చింతకుంటలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మా ణంలో పటిష్ట ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. పనుల పురోగతి వివరా లను ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. లబ్ధిదారులకుమౌలిక వసతుల సదు పాయాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, అద నపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, అధికారులు పాల్గొన్నారు.

గొంతు తడపని రిజర్వాయర్



కోట్లు వెచ్చించినా నిరుపయోగం

ఇల్లందకుంట, అక్టోబరు 16: కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి నిర్మించిన రిజార్వాయర్ నాలుగేళ్లుగా ఒక్క గొంతునూ తడపలేదు. ఎగువ ప్రాంతంలో రిజార్వాయర్‌ను నిర్మించడంతో నీరు చేరడం లేదు. డీబీఎం 16 కాకతీయ కాలువ లింక్ కలిపినా ఎస్సారెస్పీ నీరు అందులో చేరడం లేదు. రిజార్వాయర్‌లోకి వరద నీరు వచ్చే అవకాశం లేకపోవడంతో ఇది అలంకార ప్రాయంగానే మిగులుతోంది.

మండల ప్రజలకు తాగునీరు అందించే లక్ష్యంతో ఉమ్మడి జమ్మి కుంట మండలంలోని ఇల్లందకుంటలో 16.75 కోట్ల రూపాయలతో మినీ రిజా ర్వాయర్ పనులు 2013లో చేపట్టారు. సుమారు 32 ఎకరాల విస్తీర్ణంలో 23 గ్రామాలకు తాగునీరు అందించే లక్ష్యంతో 2015లో రిజార్వాయర్ పను లు పూర్తి చేశారు. మొదటి విడతలో ఇల్లందకుంట, బోగంపాడు, మర్రివాని పల్లె, సిరిసేడు, శ్రీరాములపల్లె, కనగర్తి, మడిపల్లి, అంకూషపురి గ్రామాలకు తాగునీరు అందించేందుకు కరెంటు మోటర్, వాటర్ పైపులను ఏర్పాటు చేశారు. ఇంతలో మిషన్ భగీరథ పనులు ప్రారంభం కావడంతో రిజార్వాయర్‌ను పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడు. రిజార్వాయర్‌లోకి కాకతీయ కెనాల్ ద్వారా అంతంత మాత్రంగానే నీరు వస్తోంది. పక్కనే ఉన్న ఊర చెరువు నిండి మత్తడి పడ్డప్పటికీ రిజార్వాయర్‌లోని నీళ్లు రావడం లేదు.

● పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నా..

ఇల్లందకుంటలోని సీతారామచంద్రస్వామి ఆలయానికి అప్పటి టూరిజం శాఖ చైర్మన్ పేర్వారం రాములు, ఎండీ క్రిష్టియానా ఆగస్టు 24, 2016లో వచ్చి రిజార్వాయర్‌ను సందర్శించారు. రిజర్వాయర్‌ను టూరిజం శాఖ ఆధ్వర్యంలో మినీ ట్యాంక్ బండ్‌గా మారుస్తామని, బోటింగ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అది కార్యరూపం దాల్చలేదు.

● రూ. 50 లక్షలు వృథా..

మినీ ట్యాంక్ బండ్‌గా మార్చేందుకు శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ పథకం కింద 2017-18లోనే పర్యాటక అభివృద్ధి పనుల్లో భాగంగా రూ. 50లక్షలు కేటాయించింది. రిజార్వాయర్ పైన టైల్స్, గార్డెనింగ్ పక్కనే చిన్న పిల్లలు ఆడుకోవడానికి ప్రాంగణం, పరికరాలు ఏర్పాటు చేశారు. వాటిని పట్టించుకునే వారు లేక తుప్పు పట్టాయి. కట్టపై ఏపుగా చెట్లు పెరిగాయి. వాచ్‌మన్ లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది.



మినీ ట్యాంక్ బండ్‌పై ఏపుగా పెరిగిన చెట్లు

11 ఏళ్లుగా నిరూపయోగంగానే ఉంది..
- మర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఇల్లందకుంట



రిజార్వాయర్ పనులు పూర్తి చేసి 11 ఏళ్ల గడిచినా నిరూపయోగంగానే ఉంది. మండలంలోని 18 గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చేందకు రూ. 16.75కోట్లుతో రిజార్వాయర్ పనులు చేపట్టారు. ప్రణాళికలు లేకుండా ఏర్పాటు చేయడంతో రిజర్వాయర్‌లోకి నీళ్ల చేయడం లేదు.

వాచ్‌మన్‌ను నియమించాలి
- చదువు దేవేందర్‌రెడ్డి, ఇల్లందకుంట



పర్యాటక అభివృద్ధి పనులకు 50 లక్షలు వెచ్చించారు. దాని సంరక్షణ బాధ్యత ఎవరికీ అప్పగించకపోవడం వల్ల ఏపుగా చెట్లు పెరిగాయి. వాచ్‌మన్‌ను ఏర్పాటు చేయాలి. రిజర్వాయర్ వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు అధికారులు కృషి చేయాలి.



ఇల్లందకుంటలో రిజర్వాయర్

'శాతవాహన'కు రెగ్యులర్ వీసీ వచ్చేనా?
- సమస్యలు పరిష్కారమయ్యేనా?

- గణేశ్‌నగర్ 7

పశువులను కాపాడుకుందాం
- ప్రమాదకరంగా గాలికుంటు వ్యాధి
- నెల రోజులపాటు టీకాల పంపిణీ

- హుజూరాబాద్ రూరల్ 7

పద్మశాలీల్లో రాజకీయ చైతన్యం రావాలి
- పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి

- సుభాష్‌నగర్ 6

డంపింగ్‌యార్డుగా మారిన రైల్వే స్టేషన్ రోడ్డు
- దుర్వాసనతో ప్రయాణికుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

- కరీంనగర్ రూరల్ 8

నగర పాలన మరింత మెరుగుపడాలి

- ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించండి
- వంద శాతం పన్నులు వసూలు చేయాలి
- అదనపు ఆదాయవనరులపై దృష్టిపెట్టండి
- సీడీఎంఏ వీపీ గౌతమ్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పాలన మరింత మెరుగుపరిచి ప్రజలకు సత్వర సేవలందించాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలిసి నగరంలో సుడిగాలి పర్యటన చేశారు. నగరపాలక సంస్థలోని స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను, నూతనంగా నిర్మించిన సమావేశ మందిరాన్ని సందర్శించి సీసీ కెమెరా ఫుటేజీ లోకేషన్లు, సెంటర్ నిర్వహణ తదితర అంశాలను అడిగి తెలుసుకొని పలు సలహాలు, సూచనలతోపాటు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం శ్రీపాదచౌక్, తెలంగాణచౌక్ జంక్షన్లను, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను, పద్మనగర్‌లోని రాజీవ్ గృహకల్ప, డబుల్‌బెడ్ రూమ్‌ఇళ్లను, బైపాస్ రోడ్డులోని డంపుయార్డును సందర్శించారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో చేపడుతున్న బయోమైనింగ్ ప్రక్రియను తనిఖీ చేసి వేగంగా మైనింగ్ చేసి డంపుయార్డు సమస్యను పరిష్కరించాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అక్కడి నుంచి నగరపాలక సంస్థకు చేరుకొని ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, సానిటేషన్, మెప్మా విభాగాల ఉన్నతాధికారులు, సూపరింటెండెంట్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల పనితీరు, పరిపాలన పరమైన అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. నగరపాలక సంస్థకు వచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన దరఖాస్తులు వస్తే వాటిని పరిగణలోకి తీసుకోవద్దని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తును ఎల్-1, ఎల్-2లో పరిశీలన చేయాలని, క్లస్టర్ ప్రకారంగా ప్రతి సైట్‌ను ఫీల్డ్ లెవల్ విజిట్ చేసి డిసెంబరులోగా వాటిని క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. నగర పాలక సంస్థ ఆదాయాన్ని పెంచుకునేందుకు అదనపు ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలని సూచించారు. డిమాండ్ మేరకు 44.58 కోట్ల ఆస్తి పన్నులను వంద శాతం వసూలు చేయాలని డిప్యూటీ కమిషనర్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు, కమర్షియల్ భవనాల ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, మార్చి 31లోగా నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్ పన్నులన్నీ వసూలు కావాలని చెప్పారు. కొత్తగా స్వశక్తి మహిళా సంఘాల గ్రూపులను ఏర్పాటు చేయాలని, మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు ఇప్పించి వారి ఆర్థిక ప్రయోజనం కలిగేలా చూడాలని ఆదేశించారు. మహిళా స్వశక్తి పథకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మహిళా శక్తి క్యాంటీన్లు, కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, సమైక్య గ్రూపుల ద్వారా కుట్టుశిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి సభ్యులకు శిక్షణ ఇప్పించాలని సూచించారు. సెంట్రింగ్, మేస్త్రీలతో జాయింట్ గ్రూపులను ఏర్పాటు చేసి రుణాలు ఇప్పించేలా మెప్మా పనిచేయాలన్నారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్ గ్రూపులను ఏర్పాటు చేసి వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదేశించారు. నగర పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించి పారిశుధ్య పనులను మరింత మెరుగు పరచాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులన్నింటిని పూర్త య్యేలా చూడాలని శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నగర అభి వృద్ధికి ప్రభుత్వ నిధులు ఇప్పిస్తానని సీడీఎంఏ చెప్పారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్‌కమిషనర్ చాహత్ భాజ్‌పాయి, ట్రైనీ కలెక్టర్ అజయ్, అదనపు కమిషనర్ సువార్త, డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, ఎస్ఈ రాజ్‌కుమార్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడీఎంఏ వీపీ గౌతమ్



పాల్గొన్న వివిధ విభాగాల అధికారులు

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME

★ I,THOUHIDA BEGUM W/O. KHAJA AMEERUDDIN, R/O. H.NO : 3-6-148, ADARSHA NAGAR, KARIMNAGAR, I HAVE CHANGED MY NAME AS "THOUHISA SULTHANA W/O."KAHA AMEERUDDIN.
AJK-16029

CHANGE OF NAME

★ I, NUMBURI SREEVALLI D/O.NUMBURI VITTAL PRASAD, (BEFORE MARRAIGE) R/O. H.NO: 5-2-132, SHIVALAYAM, AHMEDPURA, KARIMNAGAR, HAVE CHANGED MY NAME AS "PAIDA SRIVALLI W/O."PAIDA SRINIVAS" (AFTER MARRAIGE).
AJK-16030

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు. చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్ : 9703618691, 9985410640
జగిత్యాల :- సెల్ : 99854 11262
మెట్‌పల్లి :- సెల్ : 70131 42966
వేములవాడ, సిరిసిల్ల :- సెల్ : 99854 11063
పెద్దపల్లి :- 95509 00238

ఎండుతున్న ఆయిల్ పామ్ మొక్కలు

● ట్యాంకర్లతో నీటిని పోస్తూ కాపాడుకుంటున్న రైతులు



సిరిసిల్ల చిన్నబోనాలలో సాగుచేసిన అయిల్ పామ్ పంట

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): డ్రిప్‌లను మంజూ రు చేయకపోవడంతో సాగు చేసిన ఆయిల్‌పామ్ మొక్కలు ఎండిపోతు న్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయిల్‌పామ్ సాగును చేయాలని గత ప్రభుత్వం తో పాటు ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం సైతం ప్రోత్సహి స్తుండడంతో రైతులు ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ముందుకొచ్చారు. ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 212 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశారు. మొక్కలను రైతులు వారివారి



నీళ్లులేక ఎండిపోయిన మొక్క

భూముల్లో సాగు చేసుకున్నారు. వాటిని నిత్యం సుమారు 40లీటర్ల నీటిని అందించాలని దానికి అవసరమైన డ్రిప్‌లను కూడా అందిస్తామని అధికారులు రైతుల నుంచి డీడీల రూపంలో డబ్బులను తీసుకున్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసి 3నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆ రైతుల కు డ్రిఫ్‌లు మంజూరు కాలేదు. సాగుచేసిన ఆయిల్‌పామ్ మొక్కలు నీరులేక ఎండిపోతుండడంతో వాటిని కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల గ్రామానికి చెందిన యువ రైతు దడిగెల శ్రావణ్ రావు తనకు ఉన్న 9ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేసేందుకు ముందు కు రాగా ఉద్యాన అధికారులు 450 మొక్కలను సరఫరా చేశారు. అ రైతు మొక్కలను నాటి మూడు నెలలు గడుస్తున్నాయి. డ్రిప్‌కోసం రూ 1.80 లక్షల డీడీ చెల్లించినా ఇంతవరకు మంజూరు చేయకపోవడంతో నీరులేక ఆ మొక్కలు ఎండిపోతున్నాయి. రైతులు ట్యాంకర్లను ఏర్పాటుచేసి కూలీలలతో వారం రోజులనుంచి ఆయిల్‌పామ్ మొక్కలకు నీటిని పోయిస్తూ కాపాడుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి డ్రిప్‌లను మంజూరు చేసి మొక్కలను కాపాడాలని కోరుతున్నారు.

ట్యాంకర్‌తో నీటిని పోస్తున్న



చిన్నబోనాల శివారులో 9 ఎకరాలల్లో మూడు నెలల క్రితం ఆయిల్‌పాం మొక్కలను సాగు చేశాను. డ్రిప్‌కోసం డబ్బులను చెల్లించినా ఇంతవరకు డ్రిప్ మంజూరువక పోవడంతో ట్యాంకర్లతో నీటిని పోయిస్తూ మొక్కలను కాపాడుకుంటున్నాను. అధికారులు స్పందించి మొక్కలను కాపాడానికి డ్రిప్‌లను అందించాలి.

- దడిగెల శ్రావణ్‌రావు, యువరైతు, చిన్నబోనాల

ఆ ఇంట్లో అందరూ ఉద్యోగులే

ఆ ఇంట్లో అందరూ ప్రభుత్వ ఉద్యోగులే. కుటుంబంలో ఒకరు ఎక్సైజ్ శాఖలో సీఐగా పని చేస్తుండగా నలుగురు ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు. అందరూ ఉద్యోగులైనా ఉమ్మడిగా కలిసే ఉంటున్నారు. ప్రస్తుత సమాజంలో ఉమ్మడి కుటుంబాలు కనిపించే సంఘటనలు అరుదు. చిన్న విషయాలకే విడిపోతున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. అటువంటిది ఆ తోబుట్టువులంతా ఉద్యోగాలు చేస్తున్నా ఎలాంటి అహం లేకుండా ఉమ్మడి కుటుంబంగా ఉంటున్నారు. ఆదాయాల గురించి ఏనాడూ ఆలోచన చేయకుండా ఒకరికొకరు సాయంగా జీవిస్తున్నారు.



తల్లి పోచవ్వతో కొడుకులు, కూతుళ్లు

● ఒకరు ఎక్సైజ్ సీఐ, నలుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులు
● కష్టాలు ఎదురైనా లక్ష్యం దిశగా పయనం
● చదువే ఆలంబనగా.. ఉన్నత స్థాయికి
● ఉమ్మడి కుటుంబంగా ఆదర్శంగా నిలుస్తున్న తోబుట్టువులు

ఆదర్శం

గంభీరావుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : చదువే ఆలంబనగా అద్భుత విజయాలు సొంతం చేసుకున్న ఆ తోబుట్టువులు పలువురి అభినందనలు అందుకుంటున్నారు. అందరూ ఉద్యోగులైనా ఉమ్మడిగా కలిసే ఉంటున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన మరాఠి పోచవ్వ-రాజయ్య దంపతులకు ఐదు గురు సంతానం. వారిలో ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. వారంతా నర్మాల ప్రభుత్వ పాఠశాలలో మూడో తర గతి వరకు, గంభీరావుపేట హాస్టల్లో ఉంటూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి నుంచి పదోతరగతి వరకు చదువుకున్నారు..

యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించారు. ఐదుగురు సంతానంలో పెద్ద కుమారుడు మరాఠి రాజమల్లికార్జున్ ప్రభుత్వ టీచర్‌గా, రెండో కుమారుడు చంద్రశేఖర్ ఎక్సైజ్ శాఖలో సీఐగా, పెద్ద కూతురు వెంకటలక్ష్మి, రెండో కూతురు దేవలక్ష్మి, చిన్న కుమారుడు అజయ్ కుమార్ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు చేస్తున్నారు. పెద్ద వాడైన మల్లికార్జున్ స్థానిక ప్రైవేటు పాఠశాలలో నెలకు రూ.200 జీతానికి చేరి ప్రైవేటు ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ఆరంభించాడు. ఆ పాఠశాలలో తోటి ఉపాధ్యాయుల సలహాలతో ఉన్నత అభ్యాసం మొదలు పెట్టాడు. ఎంఏ, ఎంఫిల్, టీపీటీ, బీఈడీను పూర్తి చేశాడు. రెండో కుమారుడు చంద్రశేఖర్ మొదట అగ్రికల్చర్ అధికారిగా పనిచేశాడు. ఆ సమయంలో చాలా మందితో స్నేహాన్ని పెంచుకున్నాడు. గ్రూపు టూ ద్వార ఆప్కారీ శాఖలో ఎస్సైగా నియామకమయ్యాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో సీఐగా పనిచేస్తున్నాడు. వారి మార్గంలోనే ఇద్దరు చెల్లెళ్లను తమ్ముడిని నడిపించారు.

ఆత్మీయత, ఆనురాగాల నిలయం

ప్రస్తుత సమాజంలో చిన్న విషయాలకు విడిపోతున్న కుటుంబాలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నా ఆ తోబుట్టువులు ఉమ్మడిగా ఉంటున్నారు. కుటుంబంలో ఇరవై మందికి పైగా ఉంటారు. వారికి తోడు వచ్చిపోయే చుట్టాలు అదనం. అందరూ ఉద్యోగులైనా జీవితాన్ని పైసలతో కొలువక పోవడం వారి ప్రత్యేకత. ఎలాంటి గర్వం లేకుండా ఒకరికొకరు సర్దుకుపోవడం వారిలో ఉన్న గొప్ప గుణం. పిల్లల్లో వచ్చే చిన్న చిన్న మాట పట్టింపులు చూసి నచ్చజెబుతారు.

అక్షరమే మా ఇంటిని నిలబెట్టింది..: మల్లికార్జున్, టీచర్



అక్షరమే మా ఇంటిని నిలబెట్టింది. మా అమ్మనాన్నల కష్టాన్ని వృథా చేయలేదు. వాళ్లు నేర్పిన అణకువ, ఆదరణ కొనసాగించాం. మా అమ్మనాన్న లు ఆకలిని చంపిండ్రుగానీ అక్షరాన్ని చంపలేదు. వారు అందించిన అక్షరాలను ఆసరా గా చేసుకున్నాం. ఒకరు ఎక్సైజ్ శాఖలో సీఐగా, నలుగురం ఉపాధ్యాయులుగా ఎదిగాం. తల్లిదండ్రులు నేర్పిన క్రమశిక్షణను భావితరాలను అందించడమే మా కర్తవ్యం.

చిన్నతనంలో కష్టాలు..: చంద్రశేఖర్, సీఐ, ఎక్సైజ్ శాఖ



మా చిన్న తనంలో ఎన్నో కష్టాలు పడ్డాం. చదువుకోవాలనే ఆశయం ముందు ఎంత పెద్ద కష్టమైన చిన్నదిగా కనిపించేది. మా తల్లిదండ్రులు మా కోసం పడిన కష్టం చూసి అనేక సార్లు కన్నీళ్లు పెట్టుకున్నా. పెద్దాయ్యాక మా పిల్లలు ఎవరి ముందూ చేయి చాచకుండా ఉంటే చాలు అన్న మా అమ్మానాన్నల మాటలు ఇప్పటికి గుర్తుకొస్తాయి. ఒకప్పుడు మేమూ ఎందరినో సాయం కోరాం. ఇప్పుడూ ఇంకొకరికి సాయం చేసే స్థితిలో ఉన్నాం. మా అమ్మానాన్నలు ఆశించింది కూడా ఇదే.

క్రైం కార్నర్

మానేరులో దూకి వ్యక్తి ఆత్మహత్య

గంభీరావుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టులో దూకి ఇస్సాయిపేటకు చెందిన గుడ్లపల్లి ప్రకాష్ (55) ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఇస్సాయిపేటకు చెందిన గుడ్లపల్లి ప్రకాష్ కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. రెండేళ్ల క్రితం కూతురు పెళ్లికి చేసిన అప్పు, తన భార్య అనారోగ్యానికి గురవగా ఆసుపత్రుల్లో చూపించేందుకు చేసిన అప్పు భారమయ్యాయి. అప్పుతీర్చే మార్గం లేక తరచూ కుటుంబ సభ్యులతో మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం ఇంటి నుంచి కూలీ పనికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. బుధవారం నర్మల మానేరు ఒడ్డున దుస్తులు చెప్పులు ఉండడతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనుమానంతో మానేరులో వెతకగా ప్రకాష్ మృతదేహం లభించింది. అప్పుల బాధతోనే తన భర్త మానేరులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య నాగలక్ష్మీ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరి రిమాండ్

సుల్తానాబాద్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): గుడుంబాను విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు సుల్తా నాబాద్ ఎక్సైజ్ సీఐ గురునాథ్ రాథోడ్, ఎస్ఐ ఎస్ఎస్ఎన్ రాజు తెలిపారు. మండల కేంద్రంలోని మార్కండేయ కాలనీకి చెందిన బండారి స్వాతి, వడ్డెర కాలనీకి శాంతినగర్‌కు చెందిన కోట స్వరూపలు గతంలో గుడుంబా విక్రయించగా వారిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచామని, నిబంధనలు ఉల్లంఘించి మళ్లీ గుడుంబా విక్రయిస్తుండగా ఎస్ఐ రాజు, సిబ్బంది ఇద్దరిని అదుపులోకి తీసుకుని బుధవారం తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి ఎదుట హాజరుపరచగా వారిని రిమాండ్ తరలించాలని ఆదేశించారన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి

కథలాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరికొండ గ్రామబస్టాండ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన చెట్టుపల్లి అంజయ్య(52) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంజయ్య బస్టాండ్ సమీపంలో నడుచుకుంటూ రోడ్డు దాటుతుండంగా ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తి కునుకుల అనిల్ కుమార్ అతివేగం అజాగ్రత్తతో వచ్చి అంజయ్యను ఢీకొట్టాడు. సంఘటనలో అంజయ్య తీవ్రగాయాలు కాగా కుటుంబ సభ్యులు కోరుట్లలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండంగా మార్గ మధ్యంలో అంజయ్య మృతి చెందాడు. మృతుడు అంజయ్య కుమారుడు హరీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్ తెలిపారు.

జ్వరంతో బాలుడి మృతి

కోరుట్ల రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని చిన్నమెట్‌పల్లి గ్రామానికి చెందిన మ్యాడవేణి అశ్విద్ (11) అనే బాలుడు జ్వరంతో మృతి చెందాడు. స్థానికుల సమాచారం ప్రకారం.. చిన్నమెట్‌పల్లి గ్రామానికి చెందిన మ్యాడవేణి రత్నాకర్-రాధ దంపతుల కుమారుడు అశ్విద్ కోరుట్ల పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. అశ్విద్ నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా స్థానికంగా ఆర్ఎంపీ వద్ద చికిత్స అందించారు. మంగళవారం పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబసభ్యులు కోరుట్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అశ్విద్ తీవ్ర జ్వరంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

అట్రాసిటి కేసుపై డీఎస్పీ విచారణ



మేడిపల్లిలో విచారణ చేస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

మేడిపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మేడిపల్లి మండల కేంద్రంలో గొడవలు జరిగి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు కాగా గ్రామానికి డీఎస్పీ బుధవారం వచ్చి విచారణ చేశారు. దసరా ఉత్సవాలను పుస్కరించుకొని అదివారం జరిగిన జాతరలో యువకులు ఒకరిని ఒకరు తోసుకోవడంతో ఇరువర్గాల మధ్య గొడవకు దారి తీసింది. దాంతో ఒకరిపై ఒకరు దాడికి పాలుపడ్డారు. అడ్డు వచ్చిన యువకుపై సైతం దాడి చేశారు. దాంతో కొంత మంది యువకులకు గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరువర్గలవారిని శాంతింప చేశారు. వారిపై కేసు నమోదు చేశారు.

అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న నందెల్లి మహిపాల్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 17, 18, 19 తేదీల్లో నిర్వహించనున్న దక్షిణ భారత జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. గత నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న ఇ విష్ణువర్ధన్ పదివేల మీటర్లు, ఎం వినయ్ 3 వేల మీటర్ల పరుగు పోటీల్లో, గైని నక్షత్ర ట్రయథ్లాన్‌లో ప్రథమ స్థానాల్లో నిలిచి దక్షిణ భారత జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ క్రీడాకారులు నటరాజ్ రవి, హరికిషన్, రవికుమార్, రాజగోపాలాచారి, జగ్విందర్ సింగ్, బిషన్‌సింగ్ అభినందించారు.

గుండె పోటుతో చిన్నారి మృతి



శ్రీయాన్షి (ఫైల్)

జమ్మికుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి గుండె పోటుతో మృత్యువాత పడింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం పంగిడిపల్లి గ్రామానికి చెందిన మేడిపల్లి రాజు - జమున దంపతుల కూతురు శ్రీయాన్షి(4). రాజు జమ్మికుంటలోని ఓప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ భార్యాపిల్లలతో ఇక్కడే నివాసం ఉంటున్నాడు. శ్రీయాని పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. మంగళవారం ఉదయం నిద్రలేచిన తర్వాత పాఠశాలకు వెళ్లేందకు రెడీ అవుతూ ఒక్కసారిగా కిందపడిపోయింది. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు హుటాహుటిన హన్మకొం డలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు చిన్నారి ఊపిరితిత్తులో ఒక లేయర్ ఎర్పడిందని దాని వల్ల శ్వాస సరిగా ఆడక గుండెపోటు వచ్చి మృతి చెందినట్లు నిర్ధారించారు.

నాడు ఒకే బావికి ఏడుమోటలు

● నేడు అదే పేరుతో ఏడుమోటలపల్లి గ్రామం ఏర్పాటు



ఏడుమోటలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

పెగడపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నాడు సాగు నీటి కొరతతో ఒకే బావికి ఏడుమోటలు ఏర్పాటు చేయగా నేడు అదే గ్రామంగా ఏర్పడి ఏడు మోటలపల్లి గ్రామపంచాయతీగా పిలువబడుతోంది పెగడపల్లి మండలంలోని ఓ గ్రామం. పెగడపల్లి మండల కేంద్రానికి అనుబంధ గ్రామంగా ఉన్న చెర్లపల్లి (చెరువుకు ఆనుకుని ఉన్న ఇళ్లు) ఒకప్పుడు చెర్లపల్లిగా పిలవబడుతుండేది. కాగా 1970కి పూర్వం సాగునీటి కరువు ఉన్నపుడు చెరువు శిఖంలో వ్యవసాయ భావిలో నీరు సమృద్ధిగా ఉండటంతో ఒకే బావికి ఏడుమోటలు (అప్పట్లో ఎద్దుల సాయంతో నీటిని తోడేందుకు వ్యవసాయానికి మోటలు వాడేవారు) ఏర్పాటు చేశారు. కాగా అప్పటి నుంచి చెర్లపల్లి గ్రామమే ఏడుమోటలపల్లిగా మార్పు చెంది నేడు ఏడుమోటలపల్లి పేరుతోనే గ్రామపంచాయతీగా ఏర్పడి ప్రత్యేకత సంతరించుకుంది. దీంతో ఒక బావి పేరుతో నేడు గ్రామం ఏర్పడి ప్రత్యేకతను సంతరించుకుంది.

పద్మశాలీల్లో రాజకీయ చైతన్యం రావాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కామర్తపు మురళి

● పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి

సుభాష్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పద్మశాలీల్లో రాజకీయ చైతన్యం రావాలని, స్థానిక సంస్థ ఎన్నికల్లో సత్తా చాటాల్సిన అవసరముందని తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామర్తపు మురళి అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని పద్మశాలి సంక్షేమ ట్రస్టు భవనంలో రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం అభినందనీయమన్నారు. స్వర్గీయ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్‌రావు సేవలు మరువలేమన్నారు. మచ్చ ప్రభాకర్‌రావు పద్మశాలి శంఖారావం పేరుతో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, ప్రధానకార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం, ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రరావు, రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ వాసాల రమేశ్, వొళ్లా కృష్ణహరి, బొల్ల శివకుమార్, అవ్వారి భాస్కర్, బొమ్మ ప్రవళిక, బొమ్మ అమరేందర్, మార్త ప్రకాశ్, అంబటి శ్రీనివాస్, బొమ్మ రఘురాం, మున్సిపల్ ఛైర్మన్ రుద్ర రాజు, స్వర్గం మల్లేశం, పోలు సత్యనారాయణ, దూడం శ్రీనివాస్, గుడిమల్ల శ్రీకాంత్, కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీ, లెక్కల వేణుగోపాల్, ఇప్పలపల్లి సాంబయ్య, అరకాల వీరేశలింగం, గడ్డం వెంకటేశం, దీకొండ లక్ష్మినారాయణ, ఒడ్నాల రవీందర్, జక్కని ప్రభాకర్, స్వర్గం నరసయ్య, మేముల చంద్రశేఖర్, ఎల్ల మహేశ్, నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.



చెట్టును ట్రాక్టర్‌లో తరలిస్తూ..





ఎక్స్‌కవేటర్ సహాయంతో ఇలా నాటుతూ..



తిరిగి ప్రాణం పోసుకున్న వృక్షాలు..

మహా వృక్షాలకు జీవం



సత్తయ్య తిరిగి నాటిన వృక్షాలు

రాయికల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఒక్కరి ఆలోచనకు గ్రామం అంతా ఏకమై వృక్షాల రక్షణకు శ్రీకారం చుట్టారు.. మొక్కలు నాటడమే కాదు ఏళ్ల నాటి నుంచి ప్రాణవాయువు అందిస్తున్న మహా వృక్షాలను కాపాడటం పర్యా వరణ పరిరక్షణ అని నమ్మారు.. ఒక చోట తొలగించిన వృక్షాలకు మరో చోట ప్రాణం పోసి కాపాడుతున్నారు జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామస్థులు.

గ్రామస్థుల సహకారంతో...

పది సంవత్సరాలుగా గ్రామంలో పచ్చదనం కోసం వివిధ రకాల మొక్కలు నాటుతున్న తనకు వటా ఫౌండేషన్ స్ఫూర్తితో ట్రాన్స్ లోకేషన్ చేయాలనే ఆలోచన వచ్చింది. వృక్షాల రక్షణ అనే నా ఆలోచనకు గ్రామస్థులు సహకరించడంతోనే 13 వృక్షాలను మరో చోట నాటగా 11 వృక్షాలను కాపాడుకు న్నాం. ట్రాన్స్‌లోకేషన్ పద్ధతికి ఫైకాస్ జాతికి చెందిన రావి, జువ్వి, వేప, మామిడి, మారేడులాంటి వృక్షాలు అనువుగా ఉంటాయి. భారీ వృక్షాలను ఈ పద్ధతిలో నాటి మళ్లీ ప్రాణం పోయవచ్చు.



- సుంకిశాల సత్తయ్య, ఇటిక్యాల

వటా ఫౌండేషన్ స్ఫూర్తితో..


ఇటిక్యాల గ్రామానికి చెందిన సుంకి శాల సత్తయ్య అనే గీత కార్మికుడు హైదరాబాద్‌లోని వటా ఫౌండేషన్ స్ఫూర్తితో రహదారులు, భవనాల నిర్మాణంలో తొలగించే మహా వృక్షాలను ఇతర చోట నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫౌండేషన్‌లో ఉద్యోగులు ప్రతీ ఆదివారం రోడ్ల పక్కన ఉన్న పెద్ద వృక్షాలను తొలగిస్తే వాటిని తిరిగి ట్రాన్స్ లోకేషన్ పద్ధతిలో నాటేవారు. ఇదే స్ఫూర్తితో గ్రామస్థులు, గంగాదేవి ఉద్యా నవన కమిటీ సహకారంతో గ్రామ శివారులోని మామిడి తోట ఆవరణలో సుమారు 15 నుంచి 18 ఏళ్ల రావి, జువ్వి ఇతర రకాల 13 చెట్లను తొలగిం చారు. వాటిని గ్రామంలోని పలు చోట్ల నాటి రెండు నెలల్లో 11 చెట్లకు ప్రాణం పోశారు. చెట్లను ఇతర ప్రాంతాలకు తరలించి నాటడానికి అయ్యే ఖర్చులు గ్రామస్థులు భరిస్తున్నారు. ఒక్కో వృక్షాన్ని తరలించి కాపాడటానికి సుమారు 2,500 రూపాయల వరకు ఖర్చు అవుతుండగా గ్రామానికి చెందిన ఏఎస్ ఎల్ పార్శిల్ వైస్‌చైర్మన్ హిమవంతరావు, గ్రామస్థులు భరించి వృక్షాలను కాపాడారు. మహా వృక్షాలను ట్రాన్స్ లోకేషన్ పద్ధతిలో తరలించి అనువైన చోట నాటడం ద్వారా పర్యావరణ రక్షణ సాధ్యమవుతుందని చాటుతున్నారు. జిల్లాలో జగిత్యాల-కరీంనగర్ రహ దారిలో ఏళ్ల నాటి వృక్షాలను ఇదే పద్ధతిలో ఇతర చోట్ల నాటాలని ఇటీవల జిల్లా కలెక్టర్‌ను కమిటీ సభ్యులు కోరారు. రాయికల్ అటవీ శాఖ అధికారులు పరిశీ లించి గ్రామస్థులను ఇటీవల అభినందించారు.

బహు భాషల భాస్కరుడు

- సంగీత, సాహిత్యాల్లో దిట్ట
- పద్నాలుగు భాషల్లో ప్రావీణ్యం
- పదుల సంఖ్యలో అనువాదాలు చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రెండు భాషలు నేర్చుకోవడమే గగనమై పోతున్న ఈ రోజుల్లో పద్నాలుగు భాషలపై పట్టు సాధించడం సామాన్యమైన విషయం కాదు. అలాంటిది దేశంలోని విభిన్న సంస్కృతులపై అధ్యయనం ప్రారంభించి పలు భాషలపై పరిశోధన చేశారు. ఆ భాషల్లోని సాహిత్యాన్ని తెలుగు ప్రజలకు అనువాదాల రూపంలో అందించారు. ఆయా భాషల్లోని అంశాలతోనే ఎంఫిల్, పీహెచ్‌డీ చేశారు. ఇప్పటి వరకు కవిత్వం, కథ, నవల అనువాదాలు కలిపి 33 పుస్తకాలకుపైగా వెలువరించారు. సైన్స్ స్కూల్ టీచర్‌గా పనిచేస్తూ తెలుగు సాహిత్యం చదివి డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా ఎదిగి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు డాక్టర్ నలిమెల భాస్కర్. బహు భాషలు నేర్చుకోవడంతో పాటు సంగీతంపై ఎలా ఆసక్తి పెరిగిందో తన అంతరంగాన్ని డాక్టర్ నలిమెల భాస్కర్ 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు..




కొలనూరు రైల్వే స్టేషన్‌లో వివిధ పుస్తకాలు..

కొలనూరు గ్రామంలో 1979లో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేశాను. ఆ సమయంలో ఖాళీ సమయం ఎక్కువగా ఉండేది. ఆ గ్రామానికి దినపత్రిక వచ్చేది కాదు.. లైబ్రరీ లేదు. ఇతర అలవాట్లు ఏమీ లేని నాకు పుస్తక పఠనమే ఇష్టమైన అభిరుచి. దీంతో కన్నడ భాష పుస్తకంపై అధ్యయనం మొదలుపెట్టాను. ఆ పుస్తకం పూర్తి చేశాను. అప్పటికే హిందీ, తమిళం, కన్నడ భాషలపై అవగాహన వచ్చింది. తర్వాత మిగతా భాషలపై దృష్టి సారించాను. కొలనూరు రైల్వే స్టేషన్‌లో చందమామ పుస్తకంతో పాటు అన్ని భాషా పుస్తకాలు, వివిధ భాషల్లో వచ్చే ఇండియా టుడే లభించేవి. వాటిని చదువుతూ భాషలపై పట్టు సాధించాను. ఈక్రమంలోనే ఎంఫిల్ చేయాలని పించింది. ఏ అంశం మీద ఎంఫిల్ చేయాలనే ఆలోచన చేసినపుడు కొత్తపల్లి వీరభద్రారావు రాసిన 'తెలుగు పరిశోధనల భవిష్యత్ దర్శనం' పుస్తకంలోని ఒక వాక్యం నన్ను ఆకట్టుకున్నది.

'స్వాతంత్ర్యం రాక ముందు పాశ్చాత్యులు మన దేశం వచ్చి ఇక్కడి భాషలు నేర్చుకున్నారు. కానీ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతీయులెవరూ తమ మాతృభాష కాక ఇతర పొరుగు భాషలు నేర్చుకోవడం లేదు.' అన్న ఆయన మాటలు నన్ను ఆలోచింపజేశాయి. అప్పుడే నేను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'తెలుగు, తమిళ, కన్నడ, మలయాళీ సామెతల తులనాత్మక పరిశీలన' అనే అంశంపై ఎంఫిల్ పూర్తి చేశాను. ఆ తర్వాత బెంగాలి, అస్సామి, ఒరియా, గుజరాతి, పంజాబీ, ఉర్దూ, సంస్కృత భాషలను పదేళ్లలో పూర్తిగా నేర్చుకున్నాను. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'తెలుగు మళయాల సామెతల్లో కుటుంబ జీవన చిత్రాలు' అనే అంశంపై పీహెచ్‌డీ చేశాను.

బాల్యంలోనే హిందీపై ఆసక్తి

చిన్నప్పటి నుంచే ఇతర భాషలపై ఆసక్తి ఉండేది. మా ఊరిలో మేదరి రాజయ్య అనే వ్యక్తి హిందీ చాలా బాగా మాట్లాడేవాడు. నేను ఆయనతో మాట్లాడాలని ప్రయత్నించాను. తొమ్మిదో తరగతిలోకి వచ్చే సరికి హిందీ మాట్లాడడం వచ్చింది. రాజయ్య ఎప్పుడు కలిసినా హిందీలోనే మాట్లాడేవాడిని. మా ఉపాధ్యాయులు రామన్న, చక్రపాణి హిందీ చాలా బాగా చెప్పేవారు. దీంతో హిందీపై ఆసక్తి పెరిగింది. ఒకసారి కామారెడ్డికి వెళ్లినప్పుడు అంబటిపూడి రాసిన 'అరవం నేర్చుకోండి' అనే పుస్తకం కనిపించింది. నేను, నా స్నేహితుడు డి కిషన్ దానిని కొనుక్కొని బట్టీపట్టేశాం. దీంతో తమిళం మాట్లాడడం అలవాటైంది. రెండు భాషల్లో ప్రవేశం లభించడంతో ఇతర భాషలపై ఆసక్తి పెరిగింది. ఆ క్రమంలోనే 1977లో మరో స్నేహితుడు వేముల సత్యనారాయణతో కలిసి '30 రోజుల్లో కన్నడ భాష' అన్న పుస్తకం కొన్నాను. ఆ భాషనూ నేరుకున్నాను.



విభిన్న సంస్కృతుల అధ్యయనం

భారతీయ భాషలు నేర్చుకునే క్రమంలో 1990 ప్రాంతంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో వారం, పది రోజులు ఉండి అక్కడి సంస్కృతి, భాష, స్థానిక మాండలికాలను పరిశీలించాను. వివిధ రాష్ట్రాలకు వెళ్లినపుడు అక్కడి పుస్తకాలు తెచ్చుకున్నాను. ఇప్పటికీ తమిళ, మళయాళ, కన్నడ భాషల సాహిత్య పత్రికలు వస్తాయి. ఇటీవల గుజరాతీ భాషలో మహాత్మాగాంధీ ఆత్మకథ చదివాను. ఇష్టమైన సాహిత్యాన్ని ఆ మూల భాష ద్వారానే అధ్యయనం చేస్తాను.

మా ఊరు నారాయణపురంలో ఒక విద్యార్థి మీకు స్పానిష్ భాష వచ్చా అంకుల్ అని అడిగాడు.. రాదని చెప్పి దీని సంగతి తెలుసుకుందామని నేర్చుకోవడం ప్రారంభించాను. అది కొంత వంట బట్టింది. మా ప్రాంతం నుంచి చాలా మంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్తారు. వాళ్ల కోసం అరబ్బీ, ఫ్రెంచి నేర్చుకుందా మనుకున్నాను కానీ ఆరోగ్యం సహకరించలేదు. అనంతరం అన్ని మూల భాషల్లోని కథలను తెలుగులోకి అనువదించాను. తెలుగు నుంచి ఇతర భాషల్లోకి కూడా అనువదించాను. మంద మరికొన్ని కథలు అనే పేరుతో కథల పుస్తకాన్ని వేశాను. అందులో అన్ని భాషల కథలు ఉన్నాయి. 2000 సంవత్సరం తర్వాత తెలంగాణ భాష అధ్యయనం చేసి తెలుగు భాషకు తెలంగాణ మూలమని పలు సభల్లో నొక్కి చెప్పాను. తెలంగాణ భాష దేశ్య పదాలు, తెలంగాణ భాష సంస్కృత పదాలు, తెలంగాణ భాష తమిళ పదాలు, తెలంగాణ భాష క్రియా పదాలు అనే పుస్తకాలు వెలువరించాను.

అ'విశ్రాంత' సాధకుడు



మా ఊరు నారాయణపురం.. అక్కడ ఎప్పుడూ ఏదో ఒక సాంస్కృతిక కార్యక్రమం జరిగేది. దీంతో నాకు సంగీతంపై ఆసక్తి పెరిగింది. మా ఇంటి ముందే నా సీనియర్ అయిన ఎల్ నారాయణ అనే వారు ఉండేవారు. ఆయన ద్వారా పాటలు, పద్యాలు నేర్చుకున్నాను. లవకుశ నాటకంలో లవుడి పాత్ర వేశాను. గొల్లపల్లిలో శారద నాట్య కళా మండలి వారి నాటకాలు చూశాను. కృష్ణ రాయబారం నాటకంలో కృష్ణుడి పాత్ర వేశాను. అప్పుడే హార్మోనియం వాయించడం నేర్చుకున్నాను. పాటలు పాడేవాణ్ణి. కానీ ఏ రాగమో తెలిసేది కాదు. 2011లో ఉద్యోగ విరమణ చేసిన తర్వాత సంగీతం సాధన ప్రారంభించాలనుకున్నాను. కరీంనగర్‌లో ఉండే కేబీ శర్మ వద్ద 20 రోజులు సంగీతం పాఠాలు నేర్చుకున్నాను. ఆయన బిజీగా ఉండే వారు. ఆ తర్వాత నేను సమయం అక్కడ ఎక్కువ కేటాయించలేక యాను. ఏకా సుబ్బారావు రచించిన 'కొత్త సంగీత విద్యాదర్పణం' అనే పుస్తకం కొని చదివి పియానో కొనుక్కొని సంగీతం నేర్చుకున్నాను. నావద్ద ఒక పాత హార్మోనియం ఉండేది. దానిపై రాగయుక్తంగా పాడడం ఎలాగో సంవత్సరం పాటు రోజుకు ఆరుగంటలు సాధన చేశాను. దాంతో అనారోగ్యానికి గురయ్యాను. ఇప్పుడు ఇష్టమైన వేళల్లో సంగీత సాధన చేస్తున్నాను. మొత్తం 12 స్వరాలు నేర్చుకున్నాను. ప్రపంచంలోని అన్ని పాటలు కూడా ఈ స్వరాల్లోనే ఉంటాయి.. సంగీతం నేర్చుకోవడంతో నా బీఈడీ క్లాస్‌మెంట్ ఆర్ఎస్ వెంకటేశ్వర్‌రావు ప్రోత్సాహం ఉంది.దేశంలోని అన్ని భాషల పుస్తకాలు అధ్య యనం చేయడం ద్వారా భారతీయ సంస్కృతి, ఆచార వ్యవహారాలు అర్థమవుతాయి. ఏ పనిచేయాలన్నా నేర్చుకోవాలన్న ఉత్సాహం, సంకల్పం, పట్టుదల ఉండాలి. అందుకు తగిన సమయం కేటాయించాలి.

శాతవాహనకు రెగ్యులర్ వీసీ వచ్చేనా?

- ప్రారంభంకాని కొత్త కోర్సులు



శాతవాహన విశ్వవిద్యాలయం

గణేశ్‌నగర్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీలో సమస్యలు వీడడం లేదు. రెగ్యులర్ వీసీతో పాటు, అధ్యాపకుల కొరత, కొత్త కోర్సులు ప్రారం భం కాకపోవడంతో విద్యార్థులు నిరాశలో ఉన్నారు. బుధవారం ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్‌గా ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తంలను ప్రభుత్వం నియమించడంతో శాతవాహన యూనివర్సిటీకి కూడా రెగ్యులర్ వీసీ రావాలని విద్యాభిమానులు కోరుకుంటున్నారు.

తెలంగాణ రాష్ట్రంలోని 10 యూనివర్సిటీలలో శాతవాహన యూనివర్సిటీ గత ప్రభుత్వంలో చాలా వెనుకబడింది. బడ్జెట్ విషయంలో కొత్త రెగ్యులర్ కోర్సులు, పోస్టుల మంజూరు విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిందనే విమర్శలు ఉన్నాయి. 2008లో యూనివర్సిటీ ప్రారంభమైనప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటీకి రెగ్యులర్ కోర్సులు ప్రాతిపదికన పోస్టులు మంజూరు చేసింది. యూనివర్సిటీకి 200 ఎకరాల భూమిని మంజూరు చేసింది. అప్పుడు ఉన్న వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఇక్బాల్ అలీ, ప్రొఫెసర్ వీరారెడ్డి కాంగ్రెస్ ప్రభుతాన్ని ఒప్పించి నూతన భవన నిర్మాణాలు, కొత్త కోర్సులకు ప్రతిపాదన తెచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత శాతవాహన యూనివర్సిటీలో ఒక కొత్త కోర్సు కూడా ప్రారంభించకపోవడం వల్ల విద్యార్థులు నిరాశకు గురయ్యారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత యూనివర్సిటీపై ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగ సంఘాలు కొత్త ఆశలతో ఉన్నారు. ఇప్పటికైనా మంత్రులు పొన్నంప్రభాకర్, శ్రీధర్‌బాబులు శాతవాహన విశ్వవిద్యాలయంపై దృష్టి సారించి యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమించి కొత్త రెగ్యులర్ కోర్సులు, కొత్త పోస్టులు మంజూరు చేసే విధంగా చూడాలని మేధావులు, విద్యార్థి సంఘాలు, విద్యార్థులు కోరుతున్నారు. బీసీని వీసీగా నియమించాలని బీసీ సంఘాలు, బీసీ విద్యార్థి సంఘాలు కోరుతున్నారు.

పురాతన ఆలయం పరిశీలన



సింగరాయగుట్టపై ఆలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

సైదాపూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ శివారులో గల సింగరాయ గుట్టపై గల పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని బుధవారం దేవాదాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఆలయం ప్రాముఖ్యత, ఆలయ అభివృద్ధిపై ప్రజలతో చర్చించారు. ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ అధికారులు మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఆలయాన్ని సందర్శించి పరిశీలించామన్నారు. ఆలయ విశిష్టతను ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, మాజీ ఎంపీపీ కామిని వీరేశం, సింగిల్‌విండో డైరెక్టర్ బొమ్మగాని రాజు, నాయకులు కూతురు విద్యాన్‌రెడ్డి, మునిగంటి సంతోష్, అనగోని శ్రీనివాస్, గోపగోని నవీన్, రమేష్, అశోక్, వెంకట్రాజం, సమ్మయ్య, రమేష్, పాల్గొన్నారు.

ఆలయ సమాచారం

ధర్మపురిలో కోజాగరి పౌర్ణమి వేడుకలు



పాలలో చంద్రుడిని వీక్షిస్తున్న అర్చకులు

ధర్మపురి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో కోజాగిరి పౌర్ణమి వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఏటా నిర్వహించే విధంగా కోజాగిరి పౌర్ణమి సందర్భంగా స్థానిక లక్ష్మీనృసింహస్వామి దేవాలయం ప్రాంగణంలోని శేషప్ప కళా వేదిక వద్ద రాత్రి పాలలో చంద్రుడిని వీక్షించారు. రాత్రి వేళలో ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారల చిత్రపటానికి విశేష పూజలు జరిపారు. భక్తులు అర్ధరాత్రి వేళలో పాలలో చంద్రుడిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పొన్న శావపై శ్రీనివాసుడు

- పెద్ద సంఖ్యలో దర్శించుకున్న భక్తులు



స్వామివారి పొన్న శావకు స్వాగతం పలుకుతున్న భక్తులు

సిరిసిల్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల లక్ష్మీవేంకటేశ్వరస్వామి పొన్న శావపై భక్తులకు దర్శనమిచ్చాడు. సిరిసిల్లలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం పొన్న వాహనంపై గోవిందుడు భక్తులకు దర్శనమిచ్చాడు. లక్ష్మీవేంకటేశ్వరస్వామి విశేష అలకంరణతో దేవస్థానం నుంచి బయలు దేరాడు. శావ ముందు భక్తులు గోవిందా నామ స్మరణనలు మార్మోగాయి. మహిళలు అడుగడుగునా స్వామివారికి మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆడపడుచుల కోలాటం, దాండియా, చిన్నారులు సంప్రాదాయ నృత్యాలతో సందడి చేశారు.

నేడు అంజన్న తలనీలాల టెండర్లు

- పదోసారి నిర్వహణకు ఏర్పాట్లు

మల్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం పరిధిలో తలానీలాలను పోగు చేసుకునేందుకు మరోసారి టెండర్లు గురువారం జరుగనున్నాయి. తగిన వేలం రావడం లేదని వాయిదా పడుతూ వస్తున్న టెండర్లు నిర్వహించడం ఇది పదోసారి. టెండర్ల నిర్వహణ కోసం హైదరాబాద్‌లోని దేవాదాయ కమిషనర్ కార్యలయంలో ఏర్పాట్లు చేయగా ఈ-టెండర్, సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం జరుగనుంది. కాగా గురువారం నిర్వహించే టెండరులో పాల్గొనడానికి ఐదు షెడ్యూల్స్ రాగా గతంలో సేకరించిన తలనీలాలలను కిలో చొప్పున అప్పగించేందుకు నిర్వహించిన టెండర్ కూడా రద్దు కావడంతో దానికి టెండరు జరుగనుంది.

సదర్‌మాట్‌పై ఆశలు

- చివరి దశకు బ్యారేజీ పనులు
- జగిత్యాల జిల్లాలో 4,896 ఎకరాలకు సాగునీరు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 16: గోదావరి నదిపై నిర్మించిన సదర్‌మాట్ బ్యారేజీ పనులు చివరి దశకు చేరుకున్నాయి. 2017 జనవరిలో పనులు ప్రారంభమయ్యాయి. ఈ బ్యారేజీ నిర్మాణంతో జగిత్యాల జిల్లాలోని 4,896 ఎకరాలకు సాగునీరు అందనుంది. నిర్మల్, జగిత్యాల జిల్లా సరిహద్దుల్లో ఉన్న సదర్‌మాట్ పనులు గత ఏడాది పూర్తి కావాల్సి ఉన్నా వరదలు, నిధుల విడుదలలో జాప్యంతో ఆలస్యమయ్యాయి. బ్యారేజీ నిర్మాణంతో ఇబ్రహీంపట్నం మండలం కోమటి కొండాపూర్, ఎర్దండి, మూల రాంపూర్, గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ భూములు ముంపునకు గురయ్యాయి. ప్రభుత్వం ఆ భూములకు నష్ట పరిహారం అందజేసింది.

గంగనాల ప్రాజెక్టు మీదుగా..

సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణంలో జగిత్యాల జిల్లాలోని 4,896 ఎకరాలకు సాగునీరు అందతుంది. సదర్మాట్ బ్యారేజీ నుంచి వేములకుర్తి శివారులోని గంగానాల ప్రాజెక్ట్‌ను నింపుతారు. అక్కడి నుంచి పంట పొలాలకు సాగునీరు అందించనున్నారు. ఈ ప్రాంత రైతులు యాసంగిలో సాగు నీరు అందక ఇబ్బంది పడేవారు. సదర్‌మాట్ బ్యారేజీతో ఆ ఇబ్బందులు తీరుతాయి. ప్రస్తుతం సదర్‌మాట్ గేట్లు తెరవడంతో చివరి ఆయకట్టు వరకు నీరందుతోంది. ఈ ప్రాంతం పచ్చని పొలాలతో కళకళలాడుతోంది.

త్వరలో బ్యారేజీని ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

సదర్‌మాట్ బ్యారేజీని ఈ నెలాఖరు నాటికి ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యారేజీ ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి రానున్నట్లు సమాచారం. రెండు జిల్లాల సరిహద్దులో నిర్మించిన సదర్‌మాట్ బ్యారేజీని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే రెండు జిల్లాలకు చెందినవారు బ్యారేజీ సందర్శనకు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. బ్యారేజీ పరిసర ప్రాంతాల్లో వసతులు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



సదర్‌మాట్ బ్యారేజీ

నెలాఖరులో ప్రారంభానికి ఏర్పాట్లు

- లక్ష్మి, సదర్‌మాట్ ఈఈ

సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణ పనులు 95 శాతం పూర్తి అయ్యాయి. ఈ నెల చివరి నాటికి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. బ్యారేజీ నిర్మాణంతో 18 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తాం. బ్యారేజీతో ఎంతో ఉపయోగం.

రెజ్లింగ్‌లో ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెజ్లర్లు సత్తా చాటారు. హైదరాబాద్‌లో ఈనెల 15, 16 తేదీల్లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-19 రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ క్రీడాకారులు మూడు రజత, ఆరు కాంస్య పతకాలు సాధించారు. రుక్మాపూర్ సైనిక్ పాఠశాలకు చెందిన విజయ్‌కుమార్, సిద్ధార్థలు రజత పతకం కైవసం చేసుకున్నారు. బి నర్సింహ, కె రాజరథన్, ఎన్ దినేష్‌లు కాంస్య పతకాలు సాధించారు. ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ జూనియర్ కళాశాలకు చెందిన కె రాజు రజతం, కె అజయ్ కాంస్య పతకం, అల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు చెందిన వి రఘుచరణ్ కాంస్య పతకం, ట్రినిటి జూనియర్ కళాశాలకు చెందిన సీహెచ్ ఆదిత్య మహరాజ్ కంస్య పతకం సాధించినట్లు టీం కోచ్ ఎం వంశీకృష్ణ తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం, కళాశాలల క్రీడా సమాఖ్య కరీంనగర్ జిల్లా కార్యదర్శి మధుజాన్సన్‌లో అభినందించారు.



రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పతకాలు సాధించిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

రూ.6,950 పలికిన పత్తి ధర

జమ్మికుంట, అక్టోబరు 16: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,950 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 57మంది రైతులు 368క్వింటాళ్ల విడి పత్తి, 12మంది రైతులు 17క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,950, కనిష్ఠ ధర రూ.6,300 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక అక్టోబర్ 16: మండలంలోని ఇప్పలపల్లి చల్లూరు గ్రామాల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా మానేరు వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్న మూడు టాక్టర్లను పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇప్పలపల్లి గ్రామానికి చెందిన కొయ్యడ నవీన్,చల్లూరు గ్రామానికి చెందిన టాక్టర్ డ్రైవర్లు ఓనర్లు బోంగోని కూమార్,బోంగోని సదయ్యతూడి రాజులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

పశువులను కాపాడుకుందాం!

- ప్రమాదకరంగా గాలికుంటు వ్యాధి
- నెల రోజులపాటు టీకాల పంపిణీ

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం అమల్లో భాగంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ మంగళవారం ప్రారంభమైంది. పశువుల్లో గాలికుంటు వ్యాధి చాలా ప్రమాదకరం. ఇది సూక్ష్మ క్రిములతో పాటు కలుషిత నీరు, ఆహారం, వాయు కాలుష్యం ద్వారా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి నివారణ కోసం పశువులకు టీకాలు వేస్తున్నారు. ఈ నెల 15 నుంచి నెల రోజుల పాటు టీకాల పంపిణీ కొనసాగనుంది. నూరుశాతం వ్యాక్సినేషన్ వేసేలా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. టీకా సామర్థ్యం ఆరు నెలలు.. ప్రతి ఆరు నెలకొకసారి అధికారులు మూగజీవాలకు టీకాలు వేస్తుంటారు. మూడు నెలల వయసు దాటిన ప్రతి ఆవు, గేదెలకు టీకాలు వేయనున్నారు.

పనితీరుపై ప్రభావం

దేశవాళి కంటే ఎక్కువగా సంకరజాతి పశువుల్లో గాలికుంటు వ్యాధి తీవ్రత ఎక్కువ. దేశవాళి పశువుల్లో ప్రాణ నష్టం పెద్దగా లేకున్నా వ్యాధి తీవ్రత అధికం. టీకాలు వేయించకుంటే ఊపిరితిత్తుల పనితీరుపై ప్రభావం పడి పశువులకు తీవ్రంగా రొప్పు రావడం, పనిచేసే సామర్థ్యం తగ్గి, పాల ఉత్పత్తి పడిపోతుంది. ఓ దశలో చిన్న పశువులు అధిక ఉష్ణోగ్రతలతో మృతి చెందే ప్రమాదం ఉంటుంది. వ్యాధి బారినపడ్డాక వైద్యం చేయిచటం కంటే ముందే అప్రమత్తమై రైతులు పశువులకు టీకాలను వేయించాలి.



లక్షణాలు ఇలా

పవువులు నడవకలేక పోవడం, దుక్కెటెడ్లు పనులు చేసే సామర్థ్యాన్ని కోల్పోతాయి. 103 నుంచి 106 డిగ్రీల జ్వరం రావడం, నోట్లో, చిగుళ్లపై పొక్కులు వచ్చి మేత, నీరు తీసుకోలేవు. నోటి నుంచి చొంగకారడం, కాలు గెట్టెల్లో పుండ్లుపడి పురుగులు కనిపిస్తాయి. పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుంది. దీనికి చికిత్స ఖర్చు ఎక్కువగా ఉంటుంది.

రైతులు టీకాలు తప్పక వేయించాలి

-పి. రవీందర్‌రెడ్డి, పశువైద్యాధికారి, సింగాపూర్



వర్షాకాలం కావడంతో పశువులకు గాలికుంటు వ్యాధి వచ్చే అవకాశం ఉంది. రైతులు నిర్లక్ష్యం చేయకుండా పశువులకు టీకాలు తప్పకుండా వేయించాలి. వ్యాధి రాకుండా రక్షణకు టీకాలు ఎంతో అవసరం.

జిల్లా స్టోర్స్ ఏడీఈగా రాజు



గణేశ్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ నుంచి బదిలీపై వచ్చి కరీంనగర్ జిల్లా స్టోర్స్‌లో బుధవారం ఏడీఈగా కొలుపుల రాజు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు కొలుపుల రాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం

కరీంనగర్ రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం జూబ్లీ నగర్‌లో ఓపెన్‌జిమ్‌ను బుధవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ ప్రారంభించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, మాజీ సర్పంచ్ రుద్ర రాము, రుద్ర భారతి పాల్గొన్నారు.

నేటి నుంచి మహా పాదయాత్ర

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 16: కరీంనగర్ టూ శబరిమల మహాపాదయాత్ర గురువారం ఉదయం 11 గంటలకు జడ్పీ క్వార్టర్స్‌లోని అయ్యప్ప దేవాలయం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు మహా పాదయాత్ర నిర్వాహకుడు గడప నాగరాజు బుధవారం ఆలయంలో విలేకరులతో మాట్లాడుతూ నవంబరు 29 తేదీన అయ్యప్ప సన్నిధానం చేరుకుంటామని తెలిపారు. 100 మంది దీక్షాపరులు 1400 కిలోమీటర్లు 45 రోజుల పాటు నడుస్తారని పేర్కొన్నారు. సమావేశంలో డి సంపత్, బండారి శ్రావణ్, శ్రీహరి యాదవ్, కర్నాల రాము, గంగుల సురేశ్, హరీశ్, గురువయ్య, ఐల్నేని వేణుగోపాల్‌రావు, శ్రీనివాస్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పల్లకీ సేవ

కరీంనగర్ రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని శ్రీదుర్గా భవాని ఆలయంలో బుధవారం కోజాగర పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి కనుల పండువగా పల్లకి సేవా నిర్వహించారు. అమ్మవారికి పురాణం మహేశ్వ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈకార్యక్రమాల్లో ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలి

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని అద్విత పాఠశాల ప్రిన్సిపాల్ మాధురిశ్వేత అన్నారు. బుధ వారం జిల్లా కేంద్రంలోని అద్విత ఇంటర్నేషనల్ స్కూలులో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్-14, అండర్-17 బాల బాలికల చదరంగ పోటీలను నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు సమగ్ర విద్యలో ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు.



చదరంగ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుకుమార్

చదరంగంతో విమర్శనాత్మక ఆలోచన, క్రమశిక్షణ, వ్యక్తిగత అభివృద్ధి పెంపొందుతాయన్నారు. జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుకుమార్ మాట్లాడుతూ ఇలాంటి పోటీలు క్రీడా స్ఫూర్తిని, సహన శక్తిని, వ్యూహాత్మక ఆలోచనను పెంపొందిం చుతాయన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన సుమారు 200 మంది క్రీడాకారులకు జీనియస్ చెస్ అకాడమి డైరెక్టర్ కంకటి అనూప్ ఆధ్వర్యంలో చదరంగ పోటీలను నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ప్రతిభ చాటిన క్రీడాకారులను ఉమ్మడి కరీంనగర్ జిల్లా చదరంగం పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ అర్బన్ జోన్ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అంతటి శంకరయ్య, అద్విత పాఠశాల ఎండీ సౌగాని అనుదీప్, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నగర పాలక సంస్థ అవినీతిపై విచారణ జరిపించండి

-సీడీఎంఏకు వినతిపత్రం సమర్పించిన చల్ల హరిశంకర్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి భర్త, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ సీడీఎంఏను కోరారు. బుధవారం ఆయన సీడీఎంఏ గౌతమ్‌ను నగర పాలక సంస్థ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పిం చారు. 143 కోట్ల విలువ చేసే సీఎం హామీ నిధుల పనుల్లో 103 కోట్ల విలువ చేసే పనులను టెండర్లలో తీసుకున్న ఎస్‌ఆర్‌ఆర్‌సి సంస్థ కాంట్రాక్టర్ గత జనవరి వరకు పూర్తి చేయాల్సిన ఆ పనుల్లో 40శాతం పనులు పూర్తి చేసి 40 డివిజన్లలో 56 చోట్ల రోడ్లు, డ్రైనేజీల కోసం తవ్వి అసంపూర్తిగా వదిలిపెట్టి వెళ్ళాడని వినతిపత్రంలో పేర్కొన్నారు. నగరపాలక సంస్థలో 10 నుంచి 15శాతం కమీషన్ ఇవ్వనిదే అకౌంట్ సెక్షన్‌లో బిల్లులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఎనిమిది నెలల్లో 15 కోట్ల రూపాయలను ఈ కమీషన్ తీసుకొని చెల్లిం పులు చేశారని, వీటిపై విచారణ జరిపి బాధ్యు లపై చర్య తీసుకోవాలని కోరారు. ఒక్కొక్కరి నుంచి లక్ష నుంచి రెండు లక్షల వరకు తీసుకొని ప్రకటన జారీ చేయకుండా, ఇంటర్వ్యూ లేకుండా దాదాపు 200 మందిని ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా, ఉద్యోగులుగా తీసుకున్నారన్నారు. దాదాపు 15 కోట్ల రూపాయలను కార్మికులవద్ద నుంచి అక్రమ వసూలు చేశారని, వాటిపై కూడా విచారణ జరిపించి, కార్మికులకు తిరిగి ఆ డబ్బులు ఇప్పించాలని సీడీఎంఏను కోరారు.

● **పనులపై విచారణ జరిపించండి**

నగరపాలక సంస్థలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరిపించాలని కాంగ్రెస్ కార్పొరేటర్లు వేర్వేరుగా సీడీఎంఏకు వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ డివిజన్ల కార్పొరేటర్లకు 15శాతం నిధులు కేటాయించ కుండా వివక్ష చూపారన్నారు. తమ డివిజన్‌లో డ్రైనేజీ వర్క్ ఆర్డర్ ఇచ్చి రద్దు చేసి కేవలం రోడ్డు వేసి నాలుగేళ్ళుగా డివిజన్ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలతచంద్రశేఖర్ ఆరోపిస్తూ సీడీఎంఏకు వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, ఈఈ రొడ్డ యాదగిరి ఉద్యోగుల, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీడీఎంఏకు వినతిపత్రం సమర్పించారు.

● **50 లక్షల బకాయిలు ఇప్పించండి**

నగరపాలక సంస్థ పరిధిలో జనరల్ ఫండ్ నిధులతో పిలిచిన టెండర్లపనులకు సంబంధించి దాదాపు 50 లక్షల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ఇప్పించాలని కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘం కన్వీనర్ దుగ్గు మహేందర్ రాకేశ్ ఆధ్వర్యంలో సీడీఎంఎకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ బిల్లుల సమస్య ఉందని, పరిష్కరిస్తామని సీడీఎంఏ హామీ ఇచ్చారు.

గాలికుంటు టీకాలు వేయించాలి

కరీంనగర్ రూరల్, అక్టోబర్16 (ఆంధ్రజ్యోతి): రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ వినోద్ రైతులకు సూచించారు. కరీంనగర్ శివారు తీగలగుట్టపల్లిలో గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా పశువులకు టీకాలను వేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తెరవే ఆధ్వర్యంలో కథల ముచ్చట్లు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 16: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో 138వ ఎన్నీల ముచ్చట్లలో భాగంగా కథల ముచ్చట్లను పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్ ఆతిథ్యంలో గురువారం సాయంత్రం 7 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, రచయితలు పాల్గొని కథ వినిపించాలని కోరారు.

నియామకం

భగత్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బీజేపీ ధార్మిక సెల్‌కమిటీ జాయింట్ కన్వీనర్‌గా జన్మంచి విజయ్‌కుమార్ శర్మ ఎంపికయ్యారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడికృష్ణారెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

వాగ్దేవి క్లబ్ ఆధ్వర్యంలో వాకథాన్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): వాసవి వాగ్దేవి క్లబ్ ఆధ్వర్యంలో వాకథాన్ నిర్వహించారు. బుధవారం క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆర్ రవిచంద్రన్ జన్మదినం సందర్భంగా నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ జంధ్యం మాధవి, క్యాబినెట్ సెక్రెటరీ జంధ్యం మధుకర్, రీజినల్ ఛైర్‌పర్సన్ అకినపల్లి నాగరాజు, కార్యదర్శి కైలాస నవీన్, క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి నిధులు ఇప్పించండి

-సీడీఎంఏకు నగర పాలక సంస్థ పాలక వర్గం వినతి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ నిర్వహణ, నగర అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పాలకవర్గం కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ)వీపీ గౌతమ్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం కరీంనగర్‌కు వచ్చిన సీడీఎంఏను పాలకవర్గ సభ్యులు నగర పాలక సంస్థ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మేయర్ యాదగిరి సునీల్‌రావు అందుబాటులో లేకపోవడంతో ఆయన లెటర్‌హెడ్‌పై 24మంది కార్పొరేటర్లు సంతకాలు చేసి ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీఎం హామీ నిధులు 130 కోట్లను మంజూరీ చేయడంతో 60శాతం పనులను పూర్తి చేశామని, అయితే ఇప్పటి వరకు ఆ నిధులు విడుదల చేయకుండా నిలిపివేశారని పేర్కొన్నారు. దీనితో అనేక చోట్ల రోడ్లు, డ్రైనేజీల కోసం తవ్వి అసంపూర్తిగా వదిలిపెట్టారని, ఆ పనులు పూర్తయ్యేలా చూడాలని సీడీఎంఏను కోరారు. కొన్ని నెలలుగా పట్టణ ప్రగతి నిధులను కూడా ప్రభుత్వం విడుదల చేయడం లేదని, దీనితో అభివృద్ధి ఎక్కడికక్కడ నిలిచిపోయిందన్నారు. మున్సిపల్ సాధారణ నిధులు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలకు కూడా సరిపోవడం లేదని, కార్యాలయ నిర్వహణ ఖర్చులు భారంగా మారాయని అన్నారు. జనరల్ ఫండ్‌తో చేసిన పనులకు సంబంధిం చిన బిల్లులను చెల్లించక పోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదన్నారు. నిధులను మంజూరు చేయించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సీడీఎంఏ సానుకూలంగా స్పందిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిధులు నిలిచిపోయాయని, సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు.

ఎస్‌జీఎఫ్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కల్పించేందుకు విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎస్‌అశ్వత్, ఖాజా మోహినుద్దీన్ అహ్మద్, కె రిషి, సహస్ర, అనన్య, ఎంపికవ్వడం హర్షించదగిన విషయమన్నారు.

జిల్లా అధికారిని కలిసిన టీఎన్‌జీవో నాయకులు

సుభాష్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బదిలీపై వచ్చిన జిల్లా రిజిస్ట్రార్ ఆడిట్ అధికారి, కాంట్రిబ్యూటరీ పెన్షన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞను టీఎన్‌జీవో నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి లక్ష్మణరావు, టీజీవో నాయకుడు మడిపెల్లి కాళీచరణ్, టీఎన్‌జీవో సహాధ్యక్షుడు ఒంటెల రవీందర్‌రెడ్డి, కేంద్ర సంఘం నాయకుడు రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మిందర్‌సింగ్, మారుపాక రాజేశ్‌భరద్వాజ్, నేరెళ్ళ కిషన్, రమేశ్, నగేశ్, జలాలుద్దీన్‌అక్బర్, లవకుమార్, కరుణాకర్, రాజశేఖర్, మన్మీత్‌సింగ్, నాలగవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మిస్డ్ కాల్ ఇవ్వండి.. ఓటరుగా నమోదు కండి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు మొబైల్ నెంబర్ (92400-21444)ను ఏర్పాటు చేశామని, దీనికి మిస్డ్ కాల్ ఇస్తే మా సిబ్బంది ఓటరుగా నమోదు చేస్తారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి ప్రకటించారు. బుధవారం కరీంనగర్ అల్ఫోర్స్ మెయిన్ క్యాంపస్‌లో పట్టభద్రుల ఓటు నమోదు కోసం రూపొందించిన మిస్డ్ కాల్ కాంపేయిన్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

19న రెండు పుస్తకాల ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సమైక్య సాహితి ఆధ్వర్యంలో యోగా వాచస్పతి ఎస్ సంపత్‌కుమార్ రచించిన 'శివమంగళ యోగ, 'ఒంటికి యోగా మంచిదేగా' రెండు పుస్తకాలను శనివారం సాయంత్రం 5 గంటలకు కరీంనగర్ వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో ఆవిష్కరిస్తున్నట్లు బీఎస్ఆర్ శర్మ, నీలగిరి అనిత తెలిపారు.

డంపింగ్‌యార్డుగా మారిన రైల్వే స్టేషన్ రోడ్డు

-దుర్వాసనతో ప్రయాణికుల ఇక్కట్లు -పట్టించుకోని అధికారులు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులో రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు డంపింగ్ యార్డుగా మారింది. నగర శివారులోని రైల్వేస్టేషన్‌కు వాహనాల రాకపోకలు తరచూ కొనసాగి స్తుంటారు. చెత్త చెదారంతో రహదారి పక్కన నిండుకుని పోగా దుర్వాసన వెదజల్లడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే ప్రధాన రహదారితో పాటు ఓ ఆసుపత్రి, పెట్రోల్ బంక్, ఈ రహదారి వెంబడే గ్రానైట్ లారీలు, రైల్వే స్టేషన్‌కు గూడ్స్ లారీలు తరచూ రాకపోకలు సాగిస్తుం టాయి. అయితే రహదారి వెంబడే చెత్త పడేసినప్పటికీ మున్సిపల్ సిబ్బంది చూసీ చూడనట్లుగా వ్యవహరించడంతో చెత్త భారీగా పేరుకుపోయి డంపింగ్ యార్డును తలపిస్తోంది.



రైల్వే స్టేషన్ సమీపంలో పడేసిన చెత్త

ప్రస్తుతం రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు జరుగుతుండగా పక్కనే ఉన్న ఈ రహదారి చెత్త నిండి దర్శన మిస్తోంది. నగరంలో స్వచ్ఛతాహీ సేవ, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ రహదారి వెంబడి ఉన్న ఈ చెత్త మున్సిపల్ అధికారు లకు కనిపించడం లేదా అంటూ వాహనదారులు మండి పడుతున్నారు. వెంటనే సంబంధిత మున్సిపల్ అధికారులు రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న రహదారి పక్కనే ఉన్న చెత్తను తొలగించి, అక్కడ మరోసారి చెత్తను వేయకుండా చూడాలని ఆ కాలనీ వాసులు కోరుతున్నారు.

'ప్రతి ఉపాధి కూలీకి పని కల్పించేలా ప్రణాళిక '

కరీంనగర్ రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో ఉపాధిహామీ కూలీలందరికీ వంద రోజుల కల్పించే విదంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఎంపీడీవో సంజీవరావు తెలిపారు. బుధవారం కరీంనగర్ మండలంలో ఉపాధి హామీ పనుల గుర్తింపు, బడ్జెట్ ఆమోదంపై గ్రామ సభలు ప్రారంభం కాగా మొదటి రోజు జూబ్లీనగర్, చేగుర్తి గ్రామాల్లో నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సంజీవరావు మాట్లాడుతూ మండలంలో 6,608 మందికి జాబ్ కార్డులు ఉన్నాయని ప్రతి ఒక్కరికి పని కల్పించే విధంగా ప్రణాళిక రూపొందించామన్నారు. అందుకోసం గ్రామాల్లో పనులను గుర్తించాలని సూచించారు.

ఉపాధి హామీ పథకం ద్వారా వ్యక్తిగత పనులు కూడా చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సొంత పొలాల్లో పండ్ల తోటలు, గుంతలు తవ్వడం, పశువుల పాక వంటి నిర్మాణాలను కూడా చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులను గుర్తించి మొదటి ప్రాధాన్యతగా చేపట్టే విధంగా గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శోభరాణి, మాజి సర్పంచ్ రుద్ర రాము, భారతి, టిఎ, పిఎస్, ఎఫ్ఎలు, గ్రామ కార్యదర్శి రమాదేవి, కూలీలు పాల్గొన్నారు.

నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల సాధనకు కృషి

హుజూరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల సాధనకు తనవంతు కృషి చేస్తా నని డాక్టర్ బీఎన్ రావు అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని సాయి కన్వెన్షన్ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి అవ కాశం కల్పించాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ టికెట్ తనకే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిరుద్యోగులు, ఉద్యోగులు తనకు అవకాశం కల్పించి గెలిపిస్తే సమస్యలు పరిష్కరించేందుకు పోరాడుతానన్నారు. వైద్యులు రామలింగారెడ్డి, తొగరు విద్యాసాగర్, జనార్ధన్ తదితరులు ఉన్నారు.

పేదలకు పోషకాహార భద్రత కల్పించాలి

జమ్మికుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పేదలకు పూర్తి స్థాయి పోషకాహార భద్రత కల్పిం చాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేష్ అన్నారు. బుధవారం జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విటమిన్లు, ప్రోటీన్లు, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకో వాలని సూచించారు. కార్యక్రమంలో ఎ ప్రశాంతి, డాక్టర్ ఎల్ మనేష్, డాక్టర్ కె రాజేంద్రం, జి శ్రీకాంత్, డాక్టర్ ఎస్ ఓదేలుకుమార్, డాక్టర్ కె గణేష్, అధ్యాపకులు డాక్టర్ ఈ రవి, శ్రీనివాస్‌రెడ్డి, ఉమాకిరణ్, మాధవి, రవిప్రకాష్ తదితరులున్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

గంగాధర, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలోని పలు గ్రామాల్లో బీటి రోడ్ల నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయి. మండలంలోని కోట్ల నర్సింహులపల్లి నుంచి రామడుగు మండలం తిర్మలాపూర్ వరకు 2.55 కిలోమీటర్లకు రూ. 2.31 కోట్లు, ముప్పిడి నర్సయ్యపల్లి రోడ్డు 1.80 కిలోమీటర్లకు 97లక్షల సీఆర్ఆర్ నిధులు మంజూరైయ్యాయి. పది నెలల్లోనే స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రోడ్ల నిర్మాణానికి నిధులు తీసుకురావడం సంతోషంగా ఉందని మాజీ సర్పంచ్‌లు తోట కవితామల్లారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పబ్బతి తిరుపతిరెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు.

వ్యవసాయాధికారిగా ఇల్లందకుంట వాసి ఎంపిక

ఇల్లందకుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన గన్ను సింధూజ ఓపెన్ కేటగిరీలో 31వ ర్యాంకు సాధించి ధర్మపురి మం డల వ్యవసాయాధికారిగా బుధవారం ఎంపికైంది. గన్ను శ్యాంసుందర్-అరుణల కుమార్తె సింధూజ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీలో విద్యనభ్యసించింది.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై విద్యార్థుల ర్యాలీ

జమ్మికుంట,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల ఆసోసి యేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 3వ రోజు నిరవదిక బంద్‌లో భాగంగా కళాశాలల విద్యార్థులు బుధవారం పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సంద ర్భంగా ప్రైవేట్ కళాశాల డైరెక్టర్ విజేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక మధ్యలోనే తమ చదువులను నిలిపివేస్తున్నారన్నారు.

నేత్రదానంపై అవగాహన

సైదాపూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన ఠాగూర్ రమేష్ సింగ్ నేత్రాలను దానం చేసిన అతని భార్య మంజుల, కుమార్తెలు అర్చన, అఖిల, అన్వితలను తెలంగాణ నేత్ర అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో సన్మానించారు. బుధవారం దుద్దెనపల్లి గ్రామంలో రమేష్ సింగ్ సంస్మరణ సభ నిర్వహించి నేత్రదానంపై అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా భావించి నేత్రదానం చేసి మరొకరికి చూపుని వ్వాలని సూచించారు. అవయవదానం చేసే వారు సెల్ నెంబర్ 8790548706, 9441454286ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్రావు, సలహాదారులు జనార్ధన్‌రెడి ఉన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రామడుగు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఏసీపీ మాధవి అన్నారు. బుధవారం మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలోని అల్ఫోర్స్ కళాశాలలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐ సరి లాల్, ఎస్ఐ శేఖర్ తదితరులు ఉన్నారు.

● గన్నేరువరం: డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు తిమ్మాపూర్ రూరల్ సీఐ స్వామి అవగాహన కల్పించారు. మండలంలోని జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎస్ఐ నరేష్, ఎక్సైజ్ ఎస్ఐ భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన గంజాయి నివారణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● శంకరపట్నం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్యపై ధ్యాస పెట్టి ఎంచుకున్న లక్ష్యాన్ని చేరాలని కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవి అన్నారు. బుధవారం శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామం లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవి మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించి తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమం లో హెచ్ఎం విష్ణుకుమార్, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

● చొప్పదండి: చొప్పదండిలోని బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎస్ఐ అనూష పలు చట్టాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు , ట్రాఫిక్ రూల్స్, పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

● సైదాపూర్: ఎంతో భవిష్యత్ ఉన్న విద్యర్థులు మత్తు పదార్థాల(గంజాయి, డ్రగ్స్)కు బానిసలు కాకూడ దని సైదాపూర్ ఎస్సై తిరుపతి సూచించారు. బుధవారం సైదాపూర్ మండల కేంద్రంలోని వెన్కేపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయు డు రగురాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

● వీణవంక : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్ఐ తోట తిరుపతి అన్నా రు.మండలంలోని ఘన్ముక్ల మోడల్ స్కూల్ విద్యార్థులకు డ్రగ్స్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పలు అంశాలపై అవగా హన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల కలలు సహకారం చేసే దిశగా అడుగులు వేయాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని గంజాయి డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు బానిసై ఏ చేస్తారో తెలియని పరిస్థితులు ఉంటున్నారని తెలిపారు. అమ్మాయిలు రోడ్డు పై వెళ్తున్నపుడు వెంటపడితే ఎవరైనా 100కి ఫోన్ చేయా లని సూచించారు.ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మోయిజ్ ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గోపాల్‌రావుపేటలో మాట్లాడుతున్న ఏసీపీ మాధవి

మంచినీటి సహాయకుల శిక్షణ

శంకరపట్నం, అక్టోబరు 16: గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరం శంకరపట్నం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఇంట్రా డీఏ ఎండీ ఖాజా వశీయుద్దీన్ మాట్లాడుతూ శిక్షకులు నేర్పించే ప్రతి అంశాన్ని మంచినీటి సహాయకులు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాఘవేంద్రరెడ్డి, ఏఈ మొగిలి, ల్యాబ్ సిబ్బంది కోటిలింగం పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

చొప్పదండి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్ఏ మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం మండలంలోని కాట్నపల్లి, గుమ్లాపూర్ గ్రామాల్లోని గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావల్సిన సౌకర్యాలు కల్పించాలని , కోతలు లేకుండా కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ ,అధికారులు, ప్రజాప్రతినిధులు, కాం గ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



కాట్నపల్లిలో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కంకర వేశారు.. తారు మరిచారు..

గంగాధర, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో నిర్మిస్తున్న తారు రోడ్లు కంకర వేసి తారు వేయకుండా వదిలివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు దుమ్ము లేస్తుండటంతో అనారోగ్యాల బారిన పడుతున్నామని పేర్కొంటున్నారు. గటుబూత్కుర్ నుంచి ఆచంపల్లి, బూరుగుపల్లి నుంచి కొండయ్యపల్లి ,గంగాధర నుంచి రామడుగు మండలం శానగర్ వరకు కొత్త రోడ్లను నిర్మిస్తున్నారు. సంవత్సరం క్రితం ఈ దారులపై కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి కంకర వేసి వదలేశాడు. బూరుగుపల్లి నుంచి కొండయ్యపల్లికి నిర్మిస్తున్న రోడ్డు పక్కన ఇరువైపులా బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రోడ్ల వెంట వెళ్లే ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కంకర తేలిన గట్టుబూత్కూర్ రోడ్డు

కరపత్రం ఆవిష్కరణ

హుజూరాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న యాదాద్రి భువనగిరి జిల్లా ఆలే రులో జరిగే జంబుద్వీప మహాకవి చక్రవర్తి ఎర్ర ఉపాలి విగ్రహావిష్కరణ కరపత్రాన్ని బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని అంబే ద్కర్ చౌరస్తాలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎర్ర ఉపాలి కుమారుడు ఎర్ర సూర్య, మచ్చ దేవేందర్, రామంచ భరత్, వేల్పుల రత్నం, తునికి సమ్మయ్య ఉన్నారు.

రైస్ మిల్లుకు స్థలం కేటాయించాలి

గంగాధర, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండయ్యపల్లి శివారులో పీఏసీ ఎస్ ఆధ్వర్యంలో రైస్ మిల్లు నిర్మాణానికి స్థలం కేటాయించాలని సింగిల్ విండో అధ్యక్షుడు దూలం బాలగౌడ్ బుధవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కరీంనగర్‌లో వినతిపత్రం సమర్పించారు. నాయకులు ఉన్నారు.

ఊపందుకున్న వరి కోతలు

శంకరపట్నం, అక్టోబరు 15: శంకరపట్నం మండలంలో వరి కోతలు ఊపం దుకున్నాయి. దసరా పండుగ ముగిసిన తర్వాత రైతులు వరి కోతలు ప్రారంభించారు. నేలలు తేమగా ఉండటంతో ట్రాక్ మిషన్లకు డిమాండ్ ఉంది.

అధ్యాపకుడికి డాక్టరేట్

తిమ్మాపూర్, అక్టోబరు 16: స్థానిక వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డి.లక్ష్మీనా రాయణకి డిజైన్ అండ్ అండ్ అప్లికేషన్ ఆఫ్ టెరాహెట్జ్ మెటామెటీరియల్ అబ్జర్వర్‌పై చేసిన పరిశోధనకు పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫె షనల్ యూనిర్సిటీ నుంచి డాక్టరేట్ లభించి నట్లు కళాశాల జనరల్ సెక్రటరీ గంద్రా శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

విగ్రహాలు ఆవిష్కరించాలి

తిమ్మాపూర్, అక్టోబరు16: తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన బిఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించేలా చూడాలని మంద కృష్ణ మాదిగకు తిమ్మాపూర్ మండల ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. వంతడుపుల సంపత్, పారునంది జలపతి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన డీఈవో

జమ్మికుంట, అక్టోబరు 16: జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను డీఈవో జనార్ధన్‌రావు బుధవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు.